ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 26 నవంబరు 2025



దక్షిణాదిని ముంచెత్తిన వాన

● తంజావూరు జిల్లాలో 22 ఇళ్లు ధ్వంసం
● తూత్తుకుడిలో జలదిగ్బంధంలో నివాసాలు



హొగనేకల్‌లో జలపాతం హోరు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తేస్తున్నాయి. తంజావూరు జిల్లాలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు 22 ఇళ్లు ధ్వంసమయ్యాయి. వేలాది ఎకరాల్లో వరి, అరటి తోటలు నీట మునిగాయి. జిల్లాలో ఆదివారం సాయంత్రం ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం వరకూ కొనసాగాయి. మళ్ళీ సోమవారం మధ్యాహ్నం నుండి మంగళవారం వేకువజాము వరకు చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలో 4 వేల ఎకరాల విస్తీర్ణంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి నీట మునిగింది. వర్షానికి జిల్లాలో 13 పూరిగుడిసెలు సహా మొత్తం 22 ఇళ్లు ధ్వంసమయ్యాయి. నాలుగు పశువులు మరణించాయి.



తంజావూరులో కూలిన ఇల్లు



తంజావూరులో నీట మునిగిన వరి పైరుతో రైతులు

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో...

సేలం జిల్లా మేట్టూరు డ్యామ్‌లో నీటిమట్టం 113.81 అడుగులకు పెరిగింది. సోమవారం ఉదయం ఆ డ్యాంలోకి సెకనుకు 5223 ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశించాయి. మంగళవారం ఉదయం సెకనుకు 6414 ఘనపుటడుగుల చొప్పున ఆ డ్యామ్‌లోకి జలాలు ప్రవేశిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. డ్యామ్ నుంచి కావేరి డెల్టాకు 1000 ఘనపుటడుగుల చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. డ్యామ్‌లో ప్రస్తుతం 83.94 టీఎంసీల నీరుందని అధికారులు వెల్లడించారు.

కుట్రాలంలో...

తెన్‌కాశి జిల్లా తెన్‌కాశి, కుట్రాలం, సెంగోట తదితర ప్రాంతాల్లో గత మూడు రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురవటంతో అక్కడి జలపాతాలు నీటితో హోరెత్తుతున్నాయి.. కుట్రాలం ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం, పులియరువి, సిట్రరువి తదితర జలపాతాల వద్ద నీటి ఉధృతి అధికంగా ఉండటంతో మంగళవారం పర్యాటకులను స్నానం చేయకుండా అధికారులు నిషేధం విధించారు.

హొగనేకల్‌లో...

కర్ణాటకలోని ప్రధాన జలాశయాల నుండి విడుదల చేస్తున్న జలాలు, కావేరి నదిలో ప్రవహిస్తున్న నీటితో కలిసి హొగనేకల్ జలపాతంలో ఇన్‌ఫ్లో విపరీతంగా పెరుగుతోందని అధికారులు తెలిపారు. దీంతో ప్రధాన జలపాతం, సినీఫాల్స్, ఐందరువి తదితర జలపాతాలన్నీ జల కళ సంతరించుకున్నాయి. పర్యాటకులు దోనెలలో సవారీ చేసేందుకు బారులు తీరారు.

తూత్తుకుడి జిల్లాలో జలదిగ్బంధంలో ఇళ్లు

తూత్తుకుడి జిల్లా కాయల్‌పట్టినంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఆ నగరంలోని ప్రధాన వీధులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సుమారు 500లకు పైగా ఇళ్ల చుట్టూ మోకాలి లోతున వర్షపు నీరు ప్రవహించింది. మాట్టుకుళం, రత్నపురి, సీతకాత్తినగర్, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లోని ఇళ్లన్నీ జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో పురపాలక సంఘం అధికారులు ఇళ్ళ చుట్టూ చేరిన వాననీటిని మోటార్లతో తొలగించేందుకు చర్యలు చేపడుతున్నారు.



కాయల్‌పట్టినంలో ఓ వీధిలో నిలిచిన వర్షపునీరు

నాన్న హామీ నెరవేర్చా!

● కోవైలో సెమ్మొళి పూంగా ప్రారంభంపై స్టాలిన్



కోయంబత్తూరులో సెమ్మొళి పూంగా ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో సెమ్మొళి పూంగాను నిర్మిస్తానంటూ తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి 15 ఏళ్ల క్రితం ఇచ్చిన హామీని ఎట్టకేలకు తాను నెరవేర్చానని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయన ఓ సందేశం విడుదల చేశారు. 2010లో కోవైలో జరిగిన ప్రపంచ తమిళ ప్రాచీన భాషా మహానాడులో సెమ్మొళి పూంగాను ఏర్పాటు చేయనున్నట్లు అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి ప్రకటించారని గుర్తు చేశారు. ఆ మేరకు 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలో రాగానే సెమ్మొళి పూంగా పనులు ప్రారంభించనున్నట్లు ప్రకటించి, 2023లో శంకుస్థాపన చేశానని, మంగళవారం మధ్యాహ్నం ఆ ఉద్యానవనాన్ని ప్రారంభించడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. కోయంత్తూరులో గాంధీపురం సెంట్రల్ జైలు ప్రాంగణంలో 165 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించనున్న ఉద్యానవన ప్రాజెక్టులో తొలివిడతగా 45 ఎకరాల్లో రూ.208.50 కోట్లతో అన్ని హంగులతో నిర్మించిన 'సెమ్మొళి పూంగాను' ఆయన మంగళవారం ప్రారంభించారు. ఆ తర్వాత బ్యాటరీ కారులో తన మంత్రివర్గ సహచరులు, అధికారులతో కలిసి పూంగా అంతటా పర్యటించారు. ఆ తర్వాత శెట్టిపాళయం నగర పంచాయతీ ఓరాట్టుకుప్పయ్ గ్రామంలో జీడీ నాయుడు ట్రస్టు అందించిన రూ.5.67 కోట్ల వ్యయంతో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన 86 ఇళ్ళను కూడా ప్రారంభించి, లబ్దిదారులకు ఇంటి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎంపీ సామినాథన్, టీఆర్బీ రాజా, ఎన్.కయల్‌విళి సెల్వరాజ్, ఎంపీలు గణపతి రాజ్‌కుమార్, ఈశ్వరసామి, శాసనసభ్యులు వి.సెందిల్‌బాలాజీ, నగరపాలక నిర్వహణ నీటి సరఫరా శాఖ ముఖ్య కార్యదర్శి డి.కార్తికేయన్, నగరపాలక నిర్వహణా సంచాలకులు పి.మధుసూదన్ రెడ్డి, కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ కె.గిరియప్పన్వర్, కోయంబత్తూరు కార్పొరేషన్ మేయర్ కె.రంగనాయకి రామచంద్రన్, కమిషనర్ ఎం.శివగురు ప్రభాకరన్, డిప్యూటీ మేయర్ ఆర్ వెట్రిసెల్వన్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులో ప్రత్యేకతలు...

సీఎం స్టాలిన్ ప్రారంభించిన సెమ్మొళి పూంగాను 23 రకాల ఉద్యానవనాల సముదాయంగా నిర్మించారు. హెర్బల్ గార్డెన్, పొప్పాడి తోట, వాటర్ గార్డెన్, లిల్లీ గార్డెన్, ఫ్లవర్ గార్డెన్, వెదురుతోట, గులాబీల తోట, పచ్చదనం పరచుకున్న చిట్టడవులు, సంగ సాహిత్యంలో ప్రస్తావించిన వృక్షాలు, పూల మొక్కలున్నాయి. రెండు వేల రకాలకు పైగా గులాబీ మొక్కలు కూడా ఈ ఉద్యానవనంలో పెంచారు. 500 మంది కూర్చునేలా ఓపెన్ ఎయిర్ హాల్, పార్కు సిబ్బందికి గదులు, రెస్టారెంట్, రిటైల్ అవుట్ లెట్, కృత్రిమ జలపాతం కూడా ఉన్నాయి. ఈ ఉద్యానవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో 453 కార్లు నిలిచేందుకు పార్కింగ్ ఏరియా, 10 బస్సులు, 1000 ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయడానికి అనువైన స్థలం ఉన్నాయి. అంతే కాకుండా ఈ పార్కులో జర్మన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రెండు కిలోమీటర్ల పొడవైన వర్షపునీటి సంరక్షణ డ్రైనేజీ వ్యవస్థ కూడా ఉంది.



బ్యాటరీ కారులో సెమ్మొళి పూంగాలో పర్యటిస్తున్న స్టాలిన్, మంత్రులు

29న చెన్నై సహా 11 జిల్లాలకు
ఆరెంజ్ అలర్ట్

● ప్రాంతీయ వాతావరణ కేంద్రం

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఈ నెల 29న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, ఇది పశ్చిమ, వాయువ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నందున చెన్నై సహా 11 జిల్లాలకు ప్రాంతీయ వాతావరణ కేంద్ర ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. బంగాళాఖాతంలో ఇప్పటికే ఉపరితల ఆవర్తనం ఏర్పడిన నేపథ్యంలో, కన్నియాకుమారి వద్ద కొత్తగా మరో అల్పపీడనం ఏర్పడింది. ఈ రెండు అల్పపీడనాల ప్రభావంతో రాష్ట్రంలో కోస్తా, డెల్టా జిల్లాల్లో మోస్తరు నుండి భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వాయుగుండంగా బలపడటంతో సముద్రంలో గాలుల వేగం పెరిగింది. ఈ వాయుగుండం, పశ్చిమ, వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశముందని, దీని ప్రభావంతో ఈ నెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల్లో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. ఇదిలా వుండగా, రెండు ఉపరితల ఆవర్తనాలు ఏర్పడటం గురించి నుంగంబాక్కంలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం రాష్ట్రప్రజలను, ముఖ్యంగా సముద్రంలో చేపల వేటకు వెళ్లిన జాలర్లను అప్రమత్తం చేస్తూ హెచ్చరికలు జారీచేసింది. 29, 30వ తేదీల్లో చెన్నై. కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, తంజావూరు, నాగపట్నం, పుదుకోట తదితర 11 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. మరోవైపు రాణిపేట, వేలూరు, తిరువణ్ణామలై, కళ్లకురుచ్చి, అరియలూరు, పెరంబలూరు, తిరుచ్చి, శివగంగ, రామనాధపురం జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని ఎల్లో అలర్ట్ జారీచేసింది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి
సిలబస్ మార్పు

● పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్



చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుండి ఒకటో తరగతి నుండి మూడో తరగతి వరకు పాఠ్యాంశాలను మార్చనున్నట్లు పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. దశలవారీగా 4, 5 తరగతులు, ఆ తర్వాత పదో తరగతి వరకు పాఠ్యాంశాలను పూర్తిగా మార్చనున్నట్లు ఆయన ప్రకటించారు. అన్నా శతజయంతి స్మారక గ్రంధాలయంలో పాఠ్యాంశాల మార్పునకు సంబంధించిన నిపుణుల కమిటీ, కొత్త సిలబస్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన సిలబస్ మార్పులపై చర్చలు జరిపారు. ఈ సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే పదేళ్లలో దశలవారీగా 1 నుండి 10 తరగతులు దాకా పాఠ్యాంశాలను మార్చాలని నిపుణుల కమిటీ ప్రతిపాదించినట్లు చెప్పారు. కొత్త సిలబస్ మార్పులకు తగినట్లుకు ఉపాధ్యాయులకు శిక్షణ కూడా అందించాలని సమావేశంలో నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

టీవీకేలోకి
మాజీ మంత్రి సెంగోట్టయ్యన్?



● పనయూరు పార్టీ ఆఫీసులో ఏర్పాట్లు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే)లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఆ మేరకు ఈ నెల 27న పనయూరులోని టీవీకే ప్రధాన కార్యాలయం వద్ద ఆ పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ సమక్షంలో ఆ పార్టీ సభ్యత్వం స్వీకరించనున్నారు. ప్రస్తుతం టీవీకే ప్రధాన కార్యాలయం వద్ద ప్రత్యేక వేదిక ఏర్పాట్లు జరుగుతున్నాయి. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)తో రెండేళ్లకు పైగా విభేదాలతో గడుపుతూ వచ్చిన సెంగోట్టయ్యన్ పార్టీ నుండి విడిపోయిన నేతలను విలీనం చేసుకోవాలని ఒత్తిడి చేశారు. ఆ మేరకు అసమ్మతి వర్గం నేత ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) తో, ఏఎం ఎంకే నేత టీటీవీ దినకరన్‌తో చెట్టాపట్టాలేసుకు తిరిగారు. దీంతో ఈపీఎస్ పార్టీ నుంచి సెంగోట్టయ్యన్ డిస్మిస్ చేశారు. ఈ పరిస్థితుల్లో సెంగోట్టయ్యన్ ఓపీఎస్‌తో తరచూ భేటీ అవుతున్నారు.. ఓపీఎస్ వెంట తిరుగుతుంటే తన రాజకీయ భవిష్యత్‌కు ముప్పువాటిల్లుతుందని భావించి సెంగోట్టయ్యన్ టీవీకేలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. గురు, శుక్రవారాల్లో ఆయన విజయ్ సమక్షంలో టీవీకేలో చేరాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కష్టపడితే విజయం మనదే !

● అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శులతో ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కష్టించి పనిచేస్తే విజయం తమనే వరిస్తుందని అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సూచించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, పొత్తులు, ఎన్నికల వ్యూహం, ఎస్ఐఆర్, బూత్ కమిటీల పనితీరు తదితర అంశాలపై 82 జిల్లాల కార్యదర్శులతో ఈపీఎస్ మంగళవారం ఉదయం రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగై నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన పార్టీ నేతలకు పలు కీలకమైన సూచనలిచ్చారు. గత నాలుగున్నరేళ్లుగా అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంతో జూలై 7 నుంచి నియోజకవర్గాలుగా చేపట్టిన ప్రచార యాత్ర ఇప్పటివరకు 174 నియోజకవర్గాల్లో సాగిందని, అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకున్నానన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే సమయానికి పార్టీ తరఫున ఎన్నికలకు సంబంధించిన పనులన్నింటిని పూర్తిచేయాలని, ముఖ్యంగా బూత్ కమిటీ సభ్యులతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. ప్రస్తుతం అన్ని నియోజకర్గాల్లో చేపట్టిన సర్ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఒక్కో నియోజకవర్గంలో ప్రస్తుత పార్టీ పరిస్థితి, విజయావకాశాలు, డీఎంకేకు వ్యతిరేకంగా ప్రచారం ఎలా చేయాలి? తదితర అంశాల గురించి కూడా ఈపీఎస్ ఈ సమావేశంలో ప్రస్తావించారు.



జిల్లా కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఈపీఎస్

నగల వ్యాపారిపై దాడి

● వంద సవర్ల స్వర్ణాభరణాల దోపిడీ
● ఇద్దరు ఉత్తరాది యువకుల కోసం గాలింపు



చోరీ జరిగిన నగల తయారీ దుకాణం

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎలిఫెంట్ గేట్ ప్రాంతంలోని వెంకటరాయన్ వీధిలో ఉన్న నగల తయారీ దుకాణంలోని రాజస్థాన్ వ్యాపారిపై దాడి చేసి, మత్తుమందు స్ప్రే చల్లి 100 సవర్ల బంగారు నగలను దోచుకెళ్లారు. ఈ దోపిడీకి పాల్పడిన ఇద్దరు ఉత్తరాది యువకుల ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. స్థానిక ప్యారీస్ కార్నర్ నాట్టు పిళ్లయార్ కోవిల్ వీధిలో నివసిస్తున్న రాజస్థాన్‌కు చెందిన జగదీశ్, ఎలిఫెంట్ గేట్ ప్రాంతంలో కొంతమంది స్వర్ణకారులతో నగల తయారీ దుకాణం నడుపుతున్నారు. సోమవారం సాయంత్రం ఆ దుకాణానికి ఇద్దరు యువకులు జగదీశ్ వద్ద నగలు కొనేందుకు వచ్చామని, కొత్తడిజైన్ల నగలు చూపాలని అడిగారు. ఆ మేరకు జగదీశ్ దుకాణంలోని నగలను చూపిస్తుండగా వారిద్దరూ కట్టెలతో దాడి జరిపారు. దుకాణంలో ఉన్న సీసాతో ఆయన తలను పగులగొట్టారు. అంతటితో ఆగకుండా మత్తుమందు స్ప్రే చేశారు. తీవ్రగాయాలతో జగదీష్ మూర్ఛిల్లటంతో ఇద్దరూ దుకాణంలో ఉన్న సుమారు వంద సవర్ల నగలను దోచుకుని పారిపోయారు. కాసేపటి తరువాత జగదీష్ బంధువొకరు ఆ దుకాణానికి వెళ్లగా జగదీష్ తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. దుకాణమంతా నగలు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించి, వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఎలిఫెంట్‌గేట్ సీఐ అళగమ్మాళ్ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. మైకం నుండి తేరుకున్న జగదీష్ జరిగిన దోపిడీ గురించి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. ఆ తర్వాత పోలీసులు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించగా, ఇద్దరు ఉత్తరాది యువకులు ఆ దుకాణంలోకి వెళ్ళి అరగంట తర్వాత బయటకు వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. ఆ సీసీ కెమెరా వీడియో ఆధారంగా దోపిడీ దొంగలను గుర్తించి వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలను చేపట్టాయి.

సమాచార దృశ్యిని

30న 'రామాభ్యుదయ కావ్య సౌందర్యం'

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఈ నెల 30న టీనగర్ విజయరాఘవరోడ్డులోని ఆంధ్రాక్లబ్‌లో 'తరతరాల తెలుగు కవిత' పేరుతో ఉపన్యాస కార్యక్రమం జరుగనుంది. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన సుప్రసిద్ధ శతావధాని, ప్రవచన కర్త డాక్టర్ తాతా సందీప్ శర్మ 'రామాభ్యుదయ సౌందర్యం' అనే అంశంపై ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చెన్నై కార్పొరేషన్ సమావేశం వాయిదా

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 28 ఉదయం 10 గంటలకు జరగాల్సిన సాధారణ కౌన్సిల్ సమావేశం అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు కమిషనర్ కుమారగురుబరన్ తెలిపారు. ఈ కౌన్సిల్ సమావేశం జరుగనున్న తేదీని తర్వాత ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు అరక్కోణం రైళ్లు రద్దు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైల్వేయార్డులో మరమ్మతుల కారణంగా బుధవారం రాత్రి 10 గంటలకు మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి అరక్కోణం బయలుదేరాల్సిన రైలు (43441)ను, రాత్రి 9.45 గంటలకు అరక్కోణం నుంచి మూర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు బయలుదేరాల్సిన రైలు (43442) పూర్తిగా రద్దు చేసినట్లు దక్షిణరైల్వే ప్రకటించింది. అదే విధంగా బుధవారం రాత్రి 10.55 గంటలకు మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి అరక్కోణం వెళ్లాల్సిన మెము రైలు (66009) తిరువేలంగాడు వరకే వెళ్లనుంది.

రేపు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం అదనపు టోకెన్లు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర రిజిస్ట్రేషన్‌ల శాఖ అధికారులు వెల్లడించారు. గురువారం శుభముహూర్త దినం కావడంతో ఆ రోజున పత్రాల రిజిస్ట్రేషన్‌కు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉండటంతో రోజు జారీ చేసే 100కు బదులు150 టోకెన్లు ఇవ్వనున్నారు. ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లున్న కార్యాలయంలో రోజూ ఇచ్చే 200 టోకెన్లకు బదులు 300 టోకెన్లు జారీ చేస్తారు. ఇదే విధంగా తత్కాల్ రిజిస్ట్రేషన్ల సంఖ్యను కూడా రిజిస్ట్రేషన్‌లకు వచ్చేవారిని బట్టి పెంచనున్నారు.

మాజీ కార్మికుల కోసం రూ.860 కోట్లు విడుదల

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రవాణా సంస్థల్లో పనిచేస్తూ పదవీవిరమణ పొందినర కార్మికులకు నగదు ప్రయోజనాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం రూ.860 కోట్లు విడుదల చేసింది. 2024 మే నుంచి జూలై వరకు పదవీ విరమణ, స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన వారికి ఈ నగదు అందజేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నిధులను సంబంధిత రవాణా సంస్థలకు వెంటనే విడుదల చేసి, మాజీ కార్మికులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

గ్రాము బంగారానికి రూ.7వేల రుణం

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల్లో గ్రాము బంగారంపై ఇచ్చే రుణాన్ని రూ.7,000లకు పెంచారు. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలోని సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాలు, నగర సహకార సంఘాలు, నగలపై రుణాలు ఇస్తున్నాయి. ఇప్పటివరకు గ్రాము బంగారానికి రూ.6,000 ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో బంగారు ధర పెరుగుతున్న కారణంగా సహకార బ్యాంకుల్లో నగలపై ఇచ్చే రుణం గ్రాము రూ.7,000 పెంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 42 లక్షల మందికి రూ.45వేల కోట్ల మేర నగలపై రుణాలు అందజేసినట్లు సహకార శాఖ తెలిపింది.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో కార్తీక మహాదీపోత్సవాల సందర్భంగా రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ తెలిపారు. నాగర్‌కోవిల్, తిరునల్వేలి, తూత్తుకుడి, సెంగోట, మదురై, కోయంబత్తూరు నగరాల నుంచి ఈ నెల 2, 3 తేదీల్లో ఈ బస్సులను నడుపుతామని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులకు సంబంధించిన వివరాలను www.tnstsc.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఇదే విధంగా ప్రత్యేక బస్సుల రాకపోకలకు సంబంధించిన వివరాలను ఆయా నగరాలలో ప్రత్యేక మొబైల్ నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. ఆ మేరకు మదురై వాసులు 9445014426, తిరునల్వేలి వాసులు 9445014428, నాగర్‌కోవిల్ వాసులు 9445014432, తూత్తుకుడి వాసులు 9445014430, కోయంబత్తూరు ప్రజలు 9445014435, చెన్నై ప్రయాణికులు 9445014463 అనే నెంబర్లకు ఫోన్ చేసి ఈ బస్సులలో టికెట్లను రిజర్వు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

నేడు 76వ రాజ్యాంగ దినోత్సవం

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ ధర్మాసనం 76వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ నిర్వహణలోని, ప్రైవేటు సంస్థలు, పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగ ధర్మాసనంలోని మందుమాట ప్రతిజ్ఞ చేయించాలని సీఎం స్టాలిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. రాజ్యాంగ శాసనాన్ని అనుసరిస్తూ రాష్ట్రప్రజల నైతిక హక్కులను పరిరక్షించడంలో, కుల, మత, భాషా భేదాలు లేకుండా రాష్ట్రప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ధర్మాసనం 76వ వార్షికోత్సవాన్ని కోలాహలంగా జరుపుకునేలా బుధవారం ఉదయం 11 గంటలకు సచివాలయం, న్యాయస్థానాలు, ప్రభుత్వ శాఖల అన్ని కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగ ధర్మాసనంలోని మందుమాట ప్రతిజ్ఞ చేయించాలని సీఎం ఆదేశించారు. రాజ్యాంగ శాసనంపై అవగాహన కల్పిస్తూ వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించాలని సీఎం తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్లపై పశువుల సంచారాన్ని అరికట్టాలి


తిరువళ్లూరు కలెక్టరేట్ ఎదుట సంచరిస్తున్న ఆవులు

తిరువళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరులో రోడ్డుపై సంచరిస్తున్న పశువులను అరికట్టి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు. జిల్లా కేంద్రమైన తిరువళ్లూరు ప్రాంతం రాష్ట్ర రాజధాని చెన్నైకు సమీపంలో ఉంది.. ఇక్కడ ప్రభుత్వ వైద్యశాల, మెడికల్ కళాశాల, వాణిజ్య సంస్థలు, కలెక్టర్, ఎస్పీ కార్యాలయం ఉండటంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు నిత్యం తిరువళ్లూరుకు చేరుకోవడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీనికి తోడు పట్టణంలోని పశువులను వాటి సంరక్షకులు రోడ్డుపైకి వదిలి వేయడంతో అవి రోడ్డుపైనే సంచరిస్తు, అక్కడే నిద్రిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణవాసులు పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు రోడ్డుపై సంచరించడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి పశు సంరక్షకులపై కఠిన చర్యలు చేపట్టి రోడ్డుపై పశువుల సంచారాన్ని అరికట్టాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

గంజాయి రవాణా: ఇద్దరి అరెస్టు


నిందితులు రాజన్, సిదీష్ కోరా

తిరువళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుండి గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను తిరువళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. తిరువళ్లూరు కేంద్రంగా ఆంధ్రా, కేరళ, ఒడిశా ఇతర రాష్ట్రాల నుండి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకుజిల్లా ఎస్పీ నేతృత్వంలోని ప్రత్యేక పోలీసు బృందం తిరువళ్లూరు పరిసర ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కోయంబత్తూరు జిల్లా, కురిచి, గణేశపురం గ్రామానికి చెందిన యశోధరన్ కుమారుడు రాజన్(40), ఒడిశాలోని కోరాపుట్ గ్రామానికి చెందిన సింహ్ కోరా కుమారుడు సిదీష్ కోరా(34) అనుమానస్పదంగా సంచరిస్తుండటంతో అదుపులోకి తీసుకున్నారు. వీరు తిరువళ్లూరు కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా విక్రయానికి సిద్ధంగా వుంచిన 25.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరు కోయంబత్తూరులో కలిసి పని చేసినట్టు ఆ సమయంలో పరిచయం ఏర్పడి గంజాయి పంపిణీదారులతో సంబంధాలు ఏర్పరుచుకున్నారు. మొదట్లో సిదీష్ కోరా ఒడిశా నుంచి గంజాయిని తెచ్చి తమిళనాడు, ఆంధ్రా రాష్ట్రాల్లో సరఫరా చేసేవాడని ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో అరెస్టయి జైలు పాలయ్యాడు. జైల్లో ఉన్నప్పుడు గంజాయి పండించే , పంపిణీ చేసే వ్యక్తులతో తన సంబంధాలను మరింత పెంచుకున్నాడు. అనంతరం ఒడిశా కేంద్రంగా ఆంధ్రా, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు సరఫరా చేసేవాడు. ఇలా తమిళనాడు వ్యాప్తంగా తిరువళ్లూరు కేంద్రంగా రాజన్ గంజాయి విక్రయించినట్టు గుర్తించారు. అంతేకాకుండా తిరువళ్లూరు కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తున్న రాజన్‌ను విచారించగా, ఈ ముఠాలో మరో ఇద్దరు ఉన్నట్లు గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని సీజ్ చేసి, అరెస్టు చేసిన ఇరువురుని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

కార్తిక దీపోత్సవాలకు 15వేల మంది పోలీసులతో బందోబస్తు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కార్తిక దీపోత్సవాల సందర్భంగా 15వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ తరఫున తిరువణ్ణామలై జిల్లా ఎస్పీ మద్రాసు హైకోర్టులో నివేదిక దాఖలుచేశారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవాలకు లక్షలాది మంది హాజరవుతారని, వారికి తగిన భద్రత, మౌలిక వసతులు కల్పించేలా ఉత్తర్వులు జారీచేయాలని న్యాయవాది యానై రాజేంద్రన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి పీపీ బాలాజీ, ఈ పిటీషన్‌పై ఈ నెల 24వ తేదిలోగా అఫిడివిట్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం, తిరువణ్ణామలై జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖకు నోటీసులు పంపించారు. ఈ పిటిషన్ మళ్లీ మంగళవారం విచారణకు రాగా డీజీపీ, తిరువణ్ణామలై ఎస్పీ తరఫున అఫిడివిట్లు దాఖలుచేశారు. కార్తిక దీపోత్సవాలకు 15వేల మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నామని, భక్తుల సౌకర్యార్థం గత ఏడాది అమలుచేసిన సత్వరం పాస్ ప్రక్రియ ఈ ఏడాది కూడా అమలుచేయనున్నామని తెలిపారు. ఆలయ ప్రాంగణలో 26 ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఏడుగురు వైద్యులతో కూడి ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఈ కేసు విచారణ ముగిసినట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

రూ.105 కోట్లు కేటాయించాలని 'థాడ్కో' లేఖ

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అదనపు నిధులు అందుబాటులో ఉంటే 'సీఎం అరైజ్' పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ సబ్సిడీ రుణాలు అందిస్తామని 'థాడ్కో' తెలిపింది. సీఎం ఏఆర్ఐఎస్ పథకం కింద లబ్దిదారులకు సబ్సిడీ ఇచ్చేందుకు నిధులు లేవంటూ థాడ్కో అధికారులు దరఖాస్తులు తిరస్కరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై థాడ్కో అసిసెంట్ డైరెక్టర్ శివగురు విడుదల చేసిన ప్రకటనలో... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, ముఖ్యమంత్రి వ్యవస్థాపక పథకానికి కేటాయించిన రూ.75 కోట్లను 3,915 మంది లబ్దిదారులకు సబ్సిడీగా అందజేశామన్నారు. ఆ ప్రకారం, రెండేళ్లుగా ఈ పథకం కింద 4,687 మంది లబ్దిదారులకు రూ.90 కోట్ల మేర సబ్సిడీ అందజేయగా, ప్రస్తుతం వారు స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అలాగే, బ్యాంకుల్లో మరో 5,466 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఈ పథకానికి కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చుచేశామన్నారు. ఈ పథకానికి అదనంగా రూ.105.10 కోట్లు కేటాయించాలని ఈ నెల 11న ప్రభుత్వానికి లేఖ రాశామని తెలిపారు. ప్రభుత్వ నిధులు అంగానే దరఖాస్తుదారులు అందరికీ సబ్సిడీ రుణాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

రక్తదాన శిబిరంలో రసాభాస

● రోడ్డుపై బైఠాయించిన ఎన్‌టీకే నేతలు

తిరుత్తణి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రాంగణంలో నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రక్తదాన శిబిరం జరిగింది. తిరువళ్లూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెంకటేశన్ అధ్యక్షతన జరిగిన ఈ శిబిరానికి పెద్దసంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కోసం గత శనివారం ఉదయమే మున్సిపాలిటీ అధికారుల నుంచి ఎన్‌టీకే నిర్వాహకులు అనుమతి పొందారు. ఈ నేపథ్యంలో, అనుమతి లేకుండా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారంటూ పోలీసులు ఆ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన పార్టీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించిన రాస్తారోకో నిర్వహించారు. అనుమతి పొందాకే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, అయినప్పటికీ పోలీసులు దీనిని అడ్డుకోవడం సరికాదని కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న డీఎస్పీ కందన్ అక్కడికి చేరుకుని పార్టీ నిర్వాహకులతో చర్చించిన ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్లెక్సీలు, బ్యానర్లు, జెండాలను తొలగిస్తే రక్తదాన శిబిరానికి అనుమతిస్తామని చెప్పడంతో వాటిని పార్టీ కార్యకర్తలే తొలగించి అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

మసీదు ప్రాంగణంలో వాహనాల పార్కింగా?

● వ్యాపారుల నిరసన


నిరసన తెలుపుతున్న ముస్లిం వ్యాపారస్తులు

తిరుత్తణి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేయనున్న వాహన పార్కింగ్ స్థలానికి వ్యతిరేకిస్తూ మంగళవారం సాయంత్రం ముస్లిం వ్యాపారులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ప్రభుత్వం రూ.86లక్షలతో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తోందని, దీనివల్ల సమీపంలోని మసీదును ఆనుకుని వున్న దుకాణాలు కూల్చివేయనున్నట్లు తిరుత్తణి రహదారుశాఖ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. దీంతో చిరువ్యాపారులు రోడ్డున పడాల్సివస్తుందని, అదేకాకుండా ముస్లింలు ప్రార్థనలు చేసే స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేస్తే రద్దీ అధికమవుతుందని, వెంటనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

గర్భిణి ఆత్మహత్య

● బిడ్డను కాపాడిన వైద్యులు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గర్భిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో, శస్త్రచికిత్స ద్వారా బిడ్డను వైద్యులు సజీవంగా రక్షించారు. తిరుచ్చి పాతాళపేట దక్షిణ వీధికి చెందిన భాస్కర్ జేవియర్ భార్య రోజి (25) 8 నెలల గర్భిణి. కుటుంబ సమస్యల కారణంగా ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న రోజి పరిస్థితి విషమంగా ఉండగా, ఆమె కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యంగా ఉండడాన్ని వైద్యులు గుర్తించారు. శస్త్ర చికిత్స ద్వారా బిడ్డను రక్షించగా, చికత్స ఫలించక రోజి మృతిచెందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

'సర్' పనులు సక్రమంగా చేపట్టండి

● తిరూప్పురులో అన్నాడీఎంకే ధర్నా


ధర్నాలో పాల్గొన్న అన్నాడీఎంకే నేత పొల్లాచ్చి జయరామన్ తదితరులు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల సంఘం జరుపుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పనులను సక్రమంగా చేపట్టాలని, పనుల్లో నెలకొన్న ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే మంగళవారం ఉదయం తిరుప్పూర్‌లో ధర్నా చేపట్టింది. తిరుప్పూరు కుమరన్ కూడలి వద్ద జరిగిన ఈ ధర్నాకు అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శి పొల్లాచ్చి జయరామన్ నాయకత్వం వహించారు. ఎమ్మెల్యేలు ఉడుమలై రాధాకృష్ణన్, ఎంఎస్ఎం ఆనందన్, కేఎన్ విజయకుమార్, మాజీ ఎంపీ శివసామి పాల్గొన్నారు. బీజేపీ, టీఎంసీ స్థానిక శాఖ నాయకులు శీనివాసన్, రవికుమార్ కూడా పాల్గొన్నారు.

కార్తిక దీపోత్సవానికి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో జరిగే కార్తిక దీపోత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి.

- నెం.06075 తిరునల్వేలి-తిరువణ్ణామలై ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ తిరునల్వేలి నుంచి డిసెంబరు 3వ తేది రాత్రి 9.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06076 తిరువణ్ణామలై-తిరునల్వేలి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ తిరువణ్ణామలైలో డిసెంబరు 4వ తేది రాత్రి 7.55 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు తిరునల్వేలి చేరుకుంటుంది.
- నెం.06051 చెన్నై సెంట్రల్-చెన్నై బీచ్ ప్రత్యేక సర్క్యులర్ ఎక్స్‌ప్రెస్ (వయా.అరక్కోణం, కాట్పాడి, తిరువణ్ణామలై, విల్లుపురం, తాంబరం) చెన్నై సెంట్రల్‌లో డిసెంబరు 3,4 తేదీల్లో ఉదయం 9.15 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 7 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుంది.
- నెం.06130 విల్లుపురం-తిరువణ్ణామలై ప్రత్యేక అన్ రిజర్వ్‌డ్ మెము ఎక్స్‌ప్రెస్ విల్లుపురం నుంచి ఈ నెల 30, డిసెంబరు 3,4,5 తేదీల్లో ఉదయం 10.10 గంటలకు బయల్దేరి 11.45 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06129 తిరువణ్ణామలై-విల్లుపురం ప్రత్యేక అన్ రిజర్వ్‌డ్ మెము ఎక్స్‌ప్రెస్ రైలు తిరువణ్ణామలైలో ఈ నెల 30, డిసెంబరు 3,4,5 తేదీల్లో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి 2.15 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది.

లైంగిక వేధింపులు.. 20 ఏళ్ల జైలు

తిరువళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి స్థాయస్థానం 20యేళ్ల జైలు శిక్ష విధించింది. తిరువణ్ణామలై జిల్లా సేతుపట్టు తాలుకాలో ఓ గ్రామానికి చెందిన బాలిక (12) ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటోంది. ఈ నేపథ్యంలో ఆవడికి చెందిన దేవేంద్రన్ హాస్టల్‌లో ఉంటున్న ఆ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాలిక కుటుంబీకులు అందించిన ఫిర్యాదు మేరకు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు 2020 డిసెంబర్ 22న అరెస్టు చేశారు. ఈ కేసు తుది విచారణ తిరువళ్లూరు జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ధర్మాసనం ముందుకు రాగా విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 20యేళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమాన విధిస్తూ తీర్పువెలువరించారు. జరిమాన చెల్లించని పక్షంలో మరో ఆరేళ్ల జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

స్థలం మోసం కేసులో చెన్నైవాసికి 11 ఏళ్ల జైలు

● సహకరించిన తహసీల్దార్, ఆర్ఐలకు తలా ఏడాది జైలు. ● తీర్పునిచ్చిన తిరువారూరు కోర్టు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నకలీ దస్తావేజులతో రూ.కోటి విలువైన స్థలానికి సంబంధించి మోసం చేసిన కేసులో, ఓ వ్యక్తికి 11 ఏళ్ల జైలుశిక్ష, మహిళా తహసీల్దార్, ఆర్ఐలకు తలా ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరువారూరు కోర్టు తీర్పునిచ్చింది. తిరువారూరు అడియక్కమంగళం ప్రాంతానికి చెందిన హరిపరాబియత్తుల్ పదరియా, మలేసియాలో నివిస్తున్నాడు. ఆయన అడియక్కమంగళంలోని తన ఇల్లు, భూమి తదితర ఆస్తుల పర్యవేణకు చెన్నైకి చెందిన ఫరూఖ్ అహ్మద్‌కు హక్కులు అప్పగించాడు. 2012లో తంజావూరు-నాగపట్టణం జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ జరిగిన సమయంలో, పదరియాకు చెందిన స్థలాన్ని నకిలీ పత్రాలతో తన పేరు మీద మార్చుకున్న ఫరూఖ్ అహ్మద్, ఈ స్థలం రహదారుల శాఖకు అప్పగించి రూ. కోటి పరిహారం పొందాడు. నకిలీ దస్తావేజుల తయారీలో అప్పటి రహదారుల శాఖ ప్రత్యేక తహసీల్దార్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన జ్ఞాన సుందరి (63) పదవీ విరమణ పొందిన రెవెన్యూ అధికారి (ఆర్ఐ) రాజేంద్రన్ (67) ఫరూఖ్‌కు సహాయం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై స్థల యజమాని పదరియా 2021 ఫిబ్రవరిలో తిరువారూరు జిల్లా క్రిమినల్ కోర్టులో పిటిషన్ వేశారు. మద్రాసు హైకోర్టు ఉత్తర్వులతో ఈ కేసు సీబీసీఐడీ విచారణకు బదిలీ చేశారు. ఈ ఘటనలో ఫరూఖ్ అహ్మద్ సహా ముగ్గురిపై సీబీసీఐడీ కేసు నమోదుచేసింది. ఈ కేసు తిరువారూరు క్రిమినల్ కోర్టులో విచారణ ముగియండంతో నేరారోపణ ఎదుర్కొంటున్న ఫరూఖ్ అహ్మద్ నకిలీ పత్రాలు సృష్టించి రూ. కోటి పొందడం చట్టరీత్యా నేరమంటూ అతడికి న్యాయమూర్తి లత 11 ఏళ్ల జైలుశిక్ష విధించారు. అలాగే, పదవీ విరమణ పొందిన తహసీల్దార్ జ్ఞాన సుందరి, ఆర్ఐ రాజేంద్రన్‌లకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ మార్గంలో మరమ్మతుల కారణంగా బుధవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌బోర్డు విడుదల చేసిన ఆ ప్రాంతాల వివరాలిలా వున్నాయి...

తేనాంపేట: పోయెస్ గార్డెన్, టీవీ సాలై, జయమ్మాళ్ రోడ్, ఇళంగో సాలై, పోయెస్ రోడ్ ప్రాంతాలు, రాజకృష్ణ రోడ్డు, ఎల్డామ్స్ రోడ్డు, పెరియార్ సాలై, కామరాజర్ సాలై, కామరాజర్ వీధి, సీతమ్మాళ్ కాలనీ ప్రాంతాలు, కేపీ దాసన్ రోడ్, భారతీయార్ వీధి, భక్తవత్సలం వీధి, అప్పాదురై వీధి, టీటీకే రోడ్, క్యాథడ్రల్ రోడ్డు, జేజే రోడ్డు, పార్థసారధి పేట్టై, పార్థసారధి గార్డెన్, కేఆర్ రోడ్ ప్రాంతాలు, జార్జ్ అవెన్యూ, ఎస్ఎస్ఐ రోడ్డు, హెచ్‌డీ రాజా వీధి, ఏఆర్‌కే కాలనీ, అన్నాసాలైలోని కొంత భాగం, వీనస్ కాలనీ, ముర్రేస్ గేట్ రోడ్డు.

మీంజూర్: మీంజూర్ టౌన్, టీహెచ్ రోడ్, తెరడి స్ట్రీట్, శిరువాక్కం, సూర్య నగర్, బీడీవో ఆఫీస్, వన్నిపాక్కం, సీమవరం, ఆర్ఆర్ పాలయం అరియన్‌వోయల్, పుదుపేడు, నందియంబాక్కం, మేలూర్, పట్టామందిరి, వల్లూర్, అత్తిపట్టు, ఎస్ఆర్ పాలయం, జీఆర్ పాలయం, కొండక్కరై, పల్లిపురం, వాళుతిగైమేడు, కరయన్మేడు.

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గంజాయి విక్రయం

● బాలుడి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గంజాయి విక్రయిస్తున్న వ్యవహారంలో బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా పెన్నాడం ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలుడు 'నా వద్ద గంజాయి లభిస్తుందని' ఇన్‌స్టాగ్రామ్‌లో ఆదివారం పోస్ట్ చేశాడు. ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ జయకుమార్ ఉత్తర్వులతో, పెన్నాడం ఎస్ఐ భాగ్యరాజ్ నేతృత్వంలోని పోలీసులు, పెన్నాడం సౌత్ ముస్లిం వీధిలో నివసిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గంజాయి విక్రయిస్తున్నట్లు ఆ బాలుడు అంగీకరించాడు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు, బాలుడిని కోర్టులో హాజరుపరచి జువైనల్ హోంకు తరలించారు.

కోవైలో స్టాలిన్‌కు నల్లజెండాలతో స్వాగతం

● బీజేపీ కార్యకర్తల అరెస్టు


బీజేపీ యువమోర్చా కార్యకర్తలను వ్యాన్‌లో ఎక్కిస్తున్న పోలీసులు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో ముఖ్యమంత్రి స్టాలిన్‌కు వ్యతిరేకంగా నల్లజెండాల ప్రదర్శన జరిపిన బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరు మెట్రోరైలు ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్రమైన వివరాలతో కేంద్రానికి నివేదిక పంపకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ, రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని ఆరోపిస్తూ కోయంబత్తూరు పవర్‌హౌస్ వద్ద బీజేపీ యువజన మోర్చా కార్యకర్తలు నల్లజెండాలు పట్టుకుని 'స్టాలిన్ గోబ్యాక్' అంటూ నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని బలప్రయోగంతో వారిని తొలగించి, అరెస్టు చేసి వ్యాన్‌లో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

డిసెంబర్ 30న పొత్తులపై తుది నిర్ణయం

● పీఎంకే నేత రాందాస్

చెన్నై, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసన సభ ఎన్నికల్లో ఏ కూటమితో పొత్తు పెట్టుకోవాలనే విషయమై డిసెంబర్ 30న తలైవాసల్ ప్రాంతంలో నిర్వహించే సర్వసభ్యమండలిలో ప్రకటిస్తానని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం దిండివనం తైలాపురం గార్డెన్‌లో జరిగిన పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశంలో పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి, ధీరన్, శ్రీకాంతి, మురళి శంకర్, ఎమ్మెల్యే అరుళ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరూ ఒక్కటైతే రాజీనామా చేస్తా...

పార్టీ శ్రేయస్సు దృష్ట్యా విడిపోయిన పీఎంకే నేత అన్బుమణి, ఆ పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్ మనస్పర్థలను మరచి ఒక్కటయితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమేనని ఆ పార్టీ ఎమ్మెల్యే జీకే మణి అన్నారు. తైలాపురం గార్డెన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ రాందాస్, అన్బుమణి విడిపోవటానికి తానే కారణమని కొందరు పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారని, అన్బుమణి వర్గీయులంతా తనను దుష్టశక్తి అని కూడా విమర్శిస్తున్నారన్నారు. తండ్రీకుమారులు ఏకమై పార్టీని పటిష్ఠంగా నడపాలనే తాను మొదటి నుంచి కోరుకుంటున్నానని ఆయన చెప్పారు.

మానసిక చికిత్సా కేంద్రంలో మహిళ అనుమానాస్పద మృతి

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి సమీపంలోని మానసిక చికిత్సా కేంద్రంలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతిచెందింది. ఆవడి సమీపం సేక్కాడు అన్నానగర్ అన్నై సత్యానగర్‌లో ప్రైవేటు మానసిక చికిత్సా కేంద్రంలో 56 మంది చికిత్స పొందుతున్నారు. వేళచ్చేరికి చెందిన భాస్కర్, మానసికంగా ఇబ్బంది పడుతున్న తన తల్లి మేరిని 20 రోజుల క్రితం ఈ కేంద్రంలో చేర్చాడు. ఈ క్రమంలో, అనారోగ్యంతో మేరి మృతిచెందినట్లు కేంద్ర నిర్వాహకులు గత ఆదివారం భాస్కర్‌కు తెలియజేశారు. విషయం తెలిసి దిగ్భ్రాంతి గురైన భాస్కర్, హుటాహుటిన కేంద్రానికి చేరుకుని నిర్వాహకులను ప్రశ్నించగా, వారు సరైన సమాధానం ఇవ్వలేదని సమాచారం. భాస్కర్ ఫిర్యాదుతో ఆవడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి, మహిళ మృతికి దారితీసిన కారణాలను విచారణ చేపట్టారు.

మహిళపై దాడి..యువకుడికి 15యేళ్ల జైలుశిక్ష

వేలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళపై దాడిచేసి చోరీకి పాల్పడిన ఓ యువకుడికి న్యాయస్థానం 15యేళ్ల జైలుశిక్ష విధించింది. వివరాలిలా.. వేలూరు జిల్లా కాట్పాడి రైల్వే స్టేషన్‌లో 2022లో కేవీకుప్పంకు చెందిన హేమరాజ్ (30) అనే యువకుడు రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళపై దాడిచేసి ఆమె వద్దనున్న నగదు, నగలను చోరీచేసి పరారైయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు తుది విచారణ మంగళవారం వేలూరు సెషన్స్ కోర్టు ముందుకు రాగా, చోరీకి పాల్పడిన హేమరాజ్‌కు మహిళపై దాడి చేసినందుకు గాను 5యేళ్లు, చోరీ కేసులో 10యేళ్లు మొత్తం 15యేళ్ల జైలు శిక్షను విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

అసెంబ్లీ ఎన్నికల్లో మేమే గెలుస్తాం: బీజేపీ

తిరుత్తణి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందేది బీజేపీ కూటమేనని పళ్లిపట్టు యూనియన్ బీజేపీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథులుగా తిరువళ్లూరు పశ్చిమ జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌కుమార్, రాష్ట్ర కార్మిక విభాగం కో-ఆర్గనైజర్ శ్రీకిరణ్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆనంద ప్రియ, నిర్వాహకులు భాస్కర్ సహా పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు బైక్‌లకు నిప్పు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలోని అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోని ఆరు బైక్‌లకు నిప్పు పెట్టిన వ్యవహారం కలకలం రేపింది. తూత్తుకుడి న్యూ కాలనీ సౌత్ ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో మోటారు సైకిళ్లు, కార్లు పార్కింగ్ చేశారు. సోమవారం రాత్రి ఒకటి తర్వాత మరొకటి ఇలా ఆరు బైక్‌ల్లో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో వర్షం కురుస్తుండంతో ఎవరూ గమనించలేకపోయారు. ఈ ఘటనలో ఆరు బైక్‌లు, రెండు సైకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మధ్యపాక్కం పోలీసులు విచారణ చేపట్టారు.

చిత్రజ్యోతి

దర్శకత్వంపై ఆసక్తి పెరుగుతోంది : కృతిశెట్టి



తనకు దర్శకత్వ శాఖపై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోందని యువ నటి కృతిశెట్టి అన్నారు. 'ఉప్పెన' అనే తెలుగు చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన కృతిశెట్టి... ప్రస్తుతం తమిళంలో మూడు చిత్రాల్లో నటించారు. వీటిలో ఒకటి కార్తి నటించిన 'వా వాత్తియార్', రెండోది రవి మోహన్ 'జీని', మూడో చిత్రం ప్రదీప్ రంగనాథన్ హీరోగా తెరకెక్కిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మనసులోని భావాలను వ్యక్తం చేశారు. 'నేను ఎంపిక చేసుకునే చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందా లేదా అన్న అంశాన్ని వారి కోణం నుంచే చూస్తాను. అదే సమయంలో నన్ను నేను మెరుగుపరుచుకునేందుకు క్లాసికల్, వెస్ట్రన్ డ్యాన్స్, బాక్సింగ్, మార్షల్ ఆర్ట్స్ వంటి వాటిలో కూడా శిక్షణ తీసుకుంటున్నాను. యాక్షన్ చిత్రాలంటే అమితమైన ఇష్టం. హీరోయిన్ సెంట్రిక్ మూవీల్లో నటించాలని ఎంతగానో ఆశపడుతున్నాను. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. ఇక్కడకు వచ్చిన తర్వాతే ఒక్కొక్కరు ఎలా కష్టపడతారో ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నాను. ఎక్కువ బాధ్యత దర్శకులపై ఉంది. దర్శకత్వ శాఖ అంటే అమితమైన ఇష్టం. సవాళ్ళను ఎదుర్కొనేందుకు సిద్ధం. అందుకే దర్శకత్వంపై కోరిక 'పెరుగుతోంది' అన్నారు.



'ద్రౌపది-2' నుంచి ఫస్ట్‌లుక్ రిలీజ్

ద్రౌపది దేవిగా రక్షణ

హీరోయిన్ రక్షణ ఇందుచూడన్ ద్రౌపది దేవిగా కనిపించనున్నారు. ప్రముఖ దర్శకుడు మోహన్ జి తెరకెక్కిస్తున్న 'ద్రౌపది-2'లో ఆమె ద్రౌపది పాత్ర పోషించారు. రిచర్డ్ రిషి హీరోగా నటించే ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇందులో ద్రౌపది దేవిగా రక్షణ ఎంతో హుందాగా కనిపిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నేతాజీ ప్రొడక్షన్స్, జీఎం ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. చిత్ర నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి వచ్చే యేడాది విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు.

కిచ్చా సుదీప్ 'మార్క్' షూటింగ్ పూర్తి

కిచ్చా సుదీప్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మార్క్' మూవీ చిత్రీకరణ పూర్తయింది. ఈ చిత్రం క్లైమాక్స్ కోసం 200 అడుగుల పొడవుతో కూడిన భారీ ఓడ సెట్ నిర్మించి చిత్రీకరించారు. ఈ క్లైమాక్స్ చిత్రీకరణలో వంద మంది టెక్నీషియన్లు, 300 మంది జూనియర్ ఆరిస్టులు పాల్గొన్నారు. ఇందులోని ముఖ్య పాత్రల్లో నవీన్ చంద్ర, యోగిబాబు, గురు సోమసుందరం, విక్రాంత్ తదిరులు నటించారు. నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసుకుని వచ్చే యేడాది విడుదల చేయనున్నారు.

సోల్జర్స్ ఫిల్మ్ ఫ్యాక్టరీ నుంచి రెండు చిత్రాలు



ప్రముఖ నిర్మాణ సంస్థ సోల్జర్స్ ఫిల్మ్ ఫ్యాక్టరీ అధినేత కేఎస్ సినీష్ ఒకే సారి రెండు చిత్రాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఒకటి అర్జున్ దాస్ హీరోగా 'సూపర్ హీరో', రెండోది ఫైనల్లీ భరత్ కథానాయకుడుగా 'నింజా' చిత్రాలను నిర్మించనున్నారు. ఈ చిత్రాల టైటిల్స్ ప్రకటించే కార్యక్రమం నగరంలో నిర్వహించారు. ప్రముఖ నటుడు శివకార్తికేయన్, ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ ఈ చిత్రాల టైటిల్స్ ఆవిష్కరించారు. మంచి కథాంశాలతో నాణ్యమైన చిత్రాలను నిర్మించడంలో నిర్మాత కేఎస్ సినీష్‌కు మంచి అనుభవం ఉంది. గతంలో ఆయన నిర్మించిన 'పార్కింగ్' మూవీ ఘన విజయం సాధించడంతో పాటు ఏకంగా మూడు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సినిమా తర్వాత ఆయన ఇపుడు ఒకేసారి రెండు చిత్రాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. 'సూపర్ హీరో'లో అర్జున్‌దాస్, తేజు అశ్విని ప్రధాన పాత్రలను పోషించనున్నారు. నటుడు శాండి నెగెటివ్ పాత్రలో కనిపించనున్నారు. చాలాకాలంగా నిర్మాత సినీష్‌తో కలిసి ప్రయాణం చేస్తున్న విఘ్నేష్ వేణుగోపాల్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అలాగే, 'నింజా' మూవీలో ఫైనల్లీ భరత్, ప్రార్థన నాథన్ జంటగా నటిస్తున్నారు.



కోయంబత్తూరు శెట్టిపాళయంలో అందరికీ ఇళ్ల నిర్మాణ పథకం కింద నిర్మించిన ఇంటి కేటాయింపు పత్రాన్ని దివ్యాంగురాలికి అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

- ఎస్‌కేపీడీ మాజీ ట్రస్టీ డాక్టర్ విజయ్‌కుమార్



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధుమేహ బాధితులు నిత్యం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) చారిటీస్ మాజీ ట్రస్టీ డాక్టర్ జి.విజయ్‌కుమార్ సూచించారు. జార్జిటౌన్ ఆదియప్పనాయకర్‌వీధిలోని ఎస్‌కేపీడీ కన్వెన్షన్ హాలులో వాసవీ ఉచిత చికిత్సాలయం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మధుమేహం వైద్య శిబిరంలో సుమారు 300 మందికిపైగా బాధితులు పాల్గొన్నారు. డాక్టర్ విజయ్‌కుమార్ నేతృత్వంలో మధుమేహం బాధితులకు పలు సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా రెండు నెలలకు సరిపడే మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, మధుమేహ బాధితులు వైద్యుల సూచన మేరకు ప్రతినెలా బరువు, రక్తపోటు, ఇతర పరీక్షలు చేయించుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని నివారించవచ్చన్నారు. కాగా, ట్రస్టీ తాతా బద్రినాథ్ వాసవీ ఉచిత చికిత్సాలయం సేవల గురించి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం మధుమేహం, బుధవారం దంత, నెలలో రెండు, నాలుగో గురువారాలు ఆర్థోపెడిక్, నెలలో తొలి శుక్రవారం రాజన్ ఐ కేర్ సహకారంతో ఉచిత నేత్రపరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇందులో పాల్గొనే వారికి స్కానింగ్ నుంచి మందుల వరకు అన్నీ ఉచితమేనని ఆయన తెలిపారు.

ఆగ్రాలో సిటీ యూనియన్ బ్యాంక్ 900వ శాఖ



బ్యాంక్ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో ప్రసిద్ధి చెందిన 'సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ) 900వ శాఖ ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఏర్పాటైంది. దీనిని సోమవారం 'నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్(ఎన్ఎస్ఐసీ) డిప్యూటీ జనరల్ మేనేజర్ సమీర్ అగర్వాల్ ప్రారంభించారు. అదేవిధంగా ఇక్కడ 'సెల్ఫ్ సర్వీస్ బ్యాంకింగ్ ఫెసిలిటీ'ని నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ అశోక్ పచౌరీ, డాక్టర్ నిషి పచౌరీ ప్రారంభించారు. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఆర్.విజయ్ ఆనంద్, వి.రమేష్ మాట్లాడుతూ.. సిటీ యూనియన్ బ్యాంక్ ప్రయాణం ఎల్లప్పుడూ నమ్మకం, పని తీరు, దీర్ఘకాలిక విలువ సృష్టిపైనే ఉంటుందన్నారు. బాధ్యతాయుతమైన విస్తరణ, నిరంతర ఆవిష్కరణలు, 120 సంవత్సరాలకు పైగా లక్షలాది మంది వినియోగదారులు తమపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టడమే తమ లక్ష్యమని వివరించారు. ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని కీలకమైన అధిక సామర్థ్యం గల రాష్ట్రాల్లో తమ ఉనికిని మరింత పెంచుకుంటున్నామని, అదే సమయంలో దక్షిణాదిలోనూ తమ బలమైన స్థావరాన్ని ఏకీకృతం చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో తాము 1000 శాఖలకు చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఆగ్రాలో 900వ శాఖ ఏర్పాటు చేయడం తమ వ్యూహాత్మక నిర్ణయమన్నారు. ఆగ్రా అనేది సంప్రదాయం, అవకాశాల పరిపూర్ణ సమ్మేళనాన్ని సూచిస్తుందన్నారు. ఈ నగరం తోలు, హస్తకళలు, ఫౌండ్రీలు, పాలరాయి వంటి ఎంఎస్ఎంఈలచే నడపబడే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక పర్యావరణ వ్యవస్థ కలిగివుందని, ఈ విభాగాలు ఎస్ఎంఈలు, వ్యాపారులకు ప్రాధాన్యత గల బ్యాంకర్‌గా తాము దగ్గరగా ఉంటామని వివరించారు.

అంతరిక్ష పరిశోధనల్లో దేశం ముందంజ

- 'రాకెట్ సైన్స్ ఫ్యూచర్ లీడర్' కార్యక్రమంలో ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసన్



విద్యార్థులతో విశ్రాంత శాస్త్రవేత్త శ్రీనివాసన్, నిర్వాహకులు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతరక్షి పరిశోధనల్లో దేశం ముందంజలో ఉందని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై సెరినిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై మిలీనియం సంయుక్త ఆధ్వర్యంలో 'రాకెట్ సైన్స్ ఫ్యూచర్ లీడర్' పేరుతో విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత పాఠశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై సెరినిటీ ప్రెసిడెంట్ ఎం.నరేంద్ర బాబు అధ్యక్షత వహించారు. ఎస్‌కేపీడీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒ.లీలా రాణి స్వాగతం పలికిన కార్యక్రమంలో కేటీసీటీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అనిల ముఖ్యఅతిథిని పరిచయం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శ్రీనివాసన్ హాజరై, రాకెట్ సైన్స్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి వివరించారు. అబ్దుల్ కలాం సహా ఎంతో మంది శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగాలకు చేసిన కృషిని ఆయన వివరించారు. ఎస్‌కేపీడీ ఆంగ్ల ఉపాధ్యాయులు సురేష్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఉదయనిధి జన్మదిన వేడుకలకు కమల్ హాసన్

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరియార్ దిడల్‌లో ఈ నెల 27 సాయంత్రం జరుగనున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదిన వేడుకల్లో మక్కల్ నీదిమయ్యం నేత కమల్‌హాసన్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. నిరుపేద విద్యార్థులకు విద్యా ఉపకరణాలను ఆయన పంపిణీ చేయనున్నారు. దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఈ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేపడుతున్నారు.

మృతిచెందిన ఏనుగుకు స్మారక మండపం



నూతనంగా నిర్మితమైన స్మారకమండపం

తిరుత్తణి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి ఆలయంలో గత 36యేళ్లుగా స్వామివారికి సేవలందించిన వళ్లి అనే ఆడ ఏనుగు 2010వ సంవత్సరంలో తిరుత్తణి నది ఒడ్డున అనారోగ్యం కారణంగా మృతిచెందింది. అనంతరం ఏనుగును ఆలయ ప్రాంగణంలో ఆలయ అధికారులు ఖననం చేశారు. ఏనుగు జ్ఞాపకార్థం అక్కడే ఓ మణిమండపం నిర్మించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు చొరవ తీసుకోవడంతో రాష్ట్రప్రభుత్వం స్మారక మండపం నిర్మాణం కోసం రూ.49.50 లక్షలు కేటాయించింది. గత జూలై లో పనులు ప్రారంభించి, ఏనుగు ప్రతిమతో పాటు చుట్టూ దేవతామూర్తుల చిత్రాలతో కూడిన మండపాన్ని ఏర్పాటు చేశారు. నిర్మాణం పనులు పూర్తైన నేపథ్యంలో, త్వరలోనే రాష్ట్ర మంత్రులు, ముఖ్యనేతల ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు మంత్రి పీకే శేఖర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యాసర్పాడిలో రూ.1.32కోట్లతో ఏసీ బస్టాండు



భూమిపూజలో మంత్రి శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాస్వామి తదితరులు

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) ఆధ్వర్యంలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింత వ్యాసర్పాడిలో రూ.1.32కోట్లతో ఎయిర్ కండిషన్ బస్టాండు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ జరిగింది. సీఎండీఏ ఛైర్మన్, మంత్రి పీకే. శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాస్వామి, ఎమ్మెల్యే శేఖర్, జోన్ ఛైర్మన్ నేతాజీ గణేశన్, కౌన్సిలర్ జె.ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) వ్యాసర్పాడిలోని 37వ వార్డులో డా.అంబేడ్కర్ ప్రభుత్వ కళాశాల సమీపంలో నిర్మించనున్న ఏసీ బస్టాండును వచ్చే పొంగల్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కౌన్సిలర్ జె.ఢిల్లీబాబు పేర్కొన్నారు.

ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న ఐసిఎఫ్ జట్టు



ఓవరాల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీతో ఐసిఎఫ్ క్రీడాకారులు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'ఆలిండియా ఇంటర్ రైల్వే ఛాంపియన్ షిప్' పోటీల్లో ఇంటెగ్రల్ కోచ్ ఫాక్టరీ (ఐసిఎఫ్) జట్టు ఓవరాల్ ఛాంపియన్ షిప్ కైవశం చేసుకుంది. డెహ్రాడూన్‌లో ఈ నెల 21 నుంచి 25వ తేది వరకు జరిగిన పోటీల్లో ఐసిఎఫ్ జట్టు మొదటిసారి అన్ని విభాగాల్లో పతకాలు సాధించింది. ఆ ప్రకారం వెయిట్ లిఫ్టింగ్ 59 కిలోల విభాగంలో ఆదర్శ్ బి.అట్టావర్ స్వర్ణం, 93 కిలోల విభాగంలో కోనార్ వెంకటేష్ పెరుమాళ్ స్వర్ణం, 105 కిలోల విభాగంలో ఆర్.షణ్ముగం స్వర్ణం, 120 కిలోల విభాగంలో పి.నిశాంత్ రజతం, 93 కిలోల విభాగంలో కె.కార్తీక్ రజత పతకాలు కైవసం చేసుకుని ఓవరాల్ ఛాంపియన్ షిప్ కైవశం చేసుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఐసిఎఫ్ అధికారులు, సహచర ఉద్యోగులు అభినందించారు.



వరల్డ్ కప్ ప్రదర్శిస్తున్న క్రీడాకారులు

జూనియర్ మెన్స్ హాకీ వరల్డ్ కప్ ప్రదర్శన

తిరువళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జూనియర్ హాకీ మెన్స్ వరల్డ్ కప్‌కు ఘన స్వాగతం పలికి, స్థానిక కల్యాణ మండపంలో ప్రదర్శించారు. ప్రజలకు హాకీపై ఆసక్తి కల్పించాలన్న ఉద్దేశంతో హాకీ వరల్డ్ కప్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు వెళ్ళి స్థానిక క్రీడాకారులతో కలిసి ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో కప్ ప్రదర్శన సోమవారం తిరువళ్లూరు చేరింది. దీంతో క్రీడాకారులు, విద్యార్థులు కప్‌కు ఘన స్వాగతం పలికి కప్‌ను తిరువళ్లూరులోని కల్యాణమండపంలో ఉంచారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యాశాఖ ఉన్నత అధికారి కర్పగం మాట్లాడుతూ, 2001, 2016లో హాకి జూనియర్ కప్‌ను మన దేశం హాకీ జట్టు గెలిచిందన్నారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది జరుగనున్న పోటీల్లో కప్‌ను గెలావలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్వో సేతరాజన్‌తో పాటు పలువురు క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో హిజ్రాకు అరుదైన శస్త్రచికిత్స



కోలుకున్న హిజ్రాకు బహుమతి అందజేస్తున్న ఎస్ఆర్ఎం ప్రైమ్ హాస్పిటల్ వైద్యనిపుణులు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎం ప్రైమ్ హాస్పిటల్‌లో లింగమార్పిడి యువకుడికి (హిజ్రా)కు అరుదైన శస్త్రచికిత్స జరిపినట్లు హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అరుళ్ ప్రకాష్ తెలిపారు. ఎండోస్కోపీ పద్ధతిలో ఎస్ఆర్ఎం ప్రైమ్ హాస్పిటల్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ సి.పాల్ దిలీప్‌కుమార్ పర్యవేక్షణలో హెపిటాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ తరుణ్ జే జార్జ్, తాను కలిసి ఈ శస్త్రచికిత్సను జరిపినట్లు ఆయన వివరించారు. లింగమార్పిడి చికిత్స సందర్భంగా జరిగిన పొరపాటు కారణంగా రోగికి ఫిస్టులా ఏర్పడి తీవ్ర అస్వస్థతకు గురిచేసిందని ఆయన పేర్కొన్నారు.

ఆదిత్యుడిపై అరుణాచలేశ్వరుడి చిద్విలాసం



సూర్యప్రభ వాహనంలో ఉన్నాములై సమేత అన్నామలైయార్ - పంచమూర్తులైన వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, పరాశక్తి, చండికేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు



వేలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై క్షేత్రంలో సోమవారం ఉదయం పతాకావిష్కరణతో ప్రారంభమైన కార్తిక దీపోత్సవాలు వైభవంగా జరుగుతన్నాయి. సోమవారం రాత్రి 9 గంటలకు వెండి అధికార నంది వాహనంలో ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్ ఉత్సవమూర్తులను అలంకరించి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. రెండో రోజైన మంగళవారం స్వామివారు అమ్మవారి సమేతుడై బంగారు సూర్యప్రభపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పంచమూర్తులైన గణపతి, వల్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, పరాశక్తి, చండికేశ్వర్లను వేర్వేరుగా పల్లకీల్లో ఆశీనులను చేసి మాడవీధుల్లో విహరింపజేయగా, భక్తులు ఉత్సవమూర్తులకు హారతులిచ్చారు. ఆలయ ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 15వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆలయ అధికారులు గిరిప్రక్షిణ మార్గం సహా పలుచోట్ల సీసీ కెమెరాలు, 26 ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి నాసర్

తిరువళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 475 మంది విద్యార్థినులకు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి నాజర్ ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. తిరువళ్లూరు జిల్లా ఆవడి కార్పొరేషన్‌లోని కామరాజర్ నగర్‌లోని ఆవడి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థినులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. జిల్లా కలెక్టర్ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి నాజర్ ముఖ్య అతిధిగా హాజరై 11వ తరగతి చదువుతన్న విద్యార్థినులు 475 మందికి సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతన్న విద్యార్థినులు నడిచి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యార్థం ఉచిత సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్టు సూచించారు. ఈ కార్యక్రమంలో పొన్నేరి ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్, ఆవడి మేయర్ ఉదయకుమార్, ఆవడి కమిషనర్ శరణ్య, జిల్లా విద్యాధికారులు కర్పగం, రవి, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, డీఎంకే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరిని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో కలుసుకున్న చెన్నైకి చెందిన తెలుగు ప్రముఖురాలు, సామాజికసేవకురాలు డాక్టర్ సత్యాదేవి



తాటిగేగులు వచ్చేశాయ్!



పండగ నెలలో సందడిచేసే గేగులు అప్పుడే కనిపిస్తున్నాయి. బజార్లలో బుట్టల్లో పెట్టుకుని అమ్ముతున్నారు. తాటిముట్టె మొలకెత్తడానికి ముందు దశే ఇది. తేగలనీ, గేగులనీ పిలుస్తారు. దీన్ని రెండు పాయలుగా చీలిస్తే మధ్యలో ఉండే దబ్బలాంటి తెల్లటిదాన్ని చందమామ అంటారు. దీని కొస మెత్తగా రుచిగా ఉంటుంది. గేగు తొక్క తీసేసి తింటే మొత్తం పిండిపదార్థామే. పీచు ఎక్కువగా ఉండే ఆహారం కావడం వల్ల జీర్ణక్రియకు బాగా దోహదపడుతుంది. తాటి చెట్ల నుంచి రాలిన పండ్లు చీకిపోయి ముట్టెలు తేలుతాయి. వీటిని ఏరి మెత్తని మట్టిలో కప్పిపెడితే మూడు నెలలకు తేగలు తయారవుతాయి. వీటిని తవ్వితీసి కాల్చుకునిగానీ ఉడకబెట్టుకుని గానీ తింటారు. సహజసిద్ధమైన ప్రకృతి ఆహారం ఇది. ఇప్పటికీ ప్రభుత్వ బడుల ముందు ఈ సీజన్‌లో అమ్ముతూ ఉంటారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

10న స్థానికులకు వైకుంఠద్వార దర్శనాల టోకెన్ల విడుదల

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనాలు జరిగే చివరి మూడురోజులు స్థానికులకు దర్శన అవకాశం కల్పించనున్నారు. జనవరి 6, 7, 8 తేదీలకు సంబంధించిన టోకెన్లను డిసెంబరు 10వ తేదీ ఉదయం 10 గంటలకు వన్ ప్లస్ త్రీ విధానంలో కేటాయించనున్నారు. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు రూ.4,500, తిరుమల స్థానికులకు 500 చొప్పున రోజుకు 5 వేల టోకెన్లు జారీ చేయనున్నారు. దీని కోసం కూడా ప్రత్యేక యాప్‌ను రూపొందించనున్నారు. ఇక, టీటీడీ ఉద్యోగులకు కూడా దర్శన విధివిధానాలను రూపొందించారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని ఓ షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.23 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,615

తలనీలాలు సమర్పించినవారు: 27,722







మాడవీధుల్లో భక్తజనం - హోల్డింగ్ పాయింట్ నుంచి క్యూలో పుష్కరిణిలోకి..

తిరుచానూరు దిగ్బంధం

● వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల ఘటనతో అధికారుల అప్రమత్తం ● పంచమి తీర్థానికి పటిష్ట చర్యలు

తిరుచానూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ ప్రక్రియలో తిరుపతి నగరం బైరాగిపట్టెడ వద్ద తొక్కిసలాట నేపథ్యంలో అధికారులు పంచమితీర్థానికి అప్రమత్తమయ్యారు. పోలీసు, టీటీడీ ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారులే ఒకటికి నాలుగుసార్లు అమ్మవారి పుష్కరిణి, ఆలయ మాడవీధులు, పార్కింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పర్యటించారు. తిరుచానూరు గ్రామాన్ని అష్టదిగ్బంధం చేశారు సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు తిరుచానూరులోకి వాహనాలను అనుమతించకుండా గ్రామ ముఖద్వారాల పోలీసు పికెట్లు ఏర్పాటుచేశారు. గ్రామంలోకి ప్రవేశించిన ప్రతి భక్తుడిని సోమవారం రాత్రి నుంచే హోల్డింగ్ పాయింట్లకు పంపారు. మంగళవారం ఉదయం 11గంటల వరకూ వచ్చిన ప్రతి ఒక్కరినీ షెడ్లకు పంపి.. విడతలవారీగా ప్రత్యేక క్యూలైన్ల ద్వారా పుష్కరిణిలోకి అనుమతించారు. టీటీడీ ఉద్యోగులు, ఇతర శాఖ ఉద్యోగులు ఎక్కడికక్కడ మీడియాను కూడా నిరోధించి 10గంటల తర్వాత పుష్కరిణిలోకి పంపారు. ఇలా ఎక్కడికక్కడ పటిష్ట చర్యలు తీసుకోవడంతో తొక్కిసలాట లేకుండా పుష్కరిణిలో భక్తులు స్నానాలాచరించారు. చిన్న చిన్న తోపులాటలు మినహాయించి ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పంచమితీర్థం ముగిసింది. దీంతో వేలాది మంది భక్తులు తరలివచ్చినా ప్రశాంత వాతావరణంలో పుణ్యస్నానాలు ఆచరించి తిరుగు పయనమయ్యారు. ఇక, సుపథం మహద్వారం వద్ద పెద్దసంఖ్యలో భక్తులు గుమికూడటంతో తోపులాట జరిగింది. భక్తులు కాస్త ఇబ్బందిపడ్డారు. పద్మావతి అమ్మవారి దర్శనానికి రాత్రి పొద్దుపోయే వరకూ భక్తులు బారులు తీరారు. వేలాది మంది తరలి వచ్చి పద్మసరోవరలో పుష్కర స్నానాలుచేశారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కలిసి జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులను అభినందించారు.



పుష్కరిణిలో భక్తులకు రక్షణగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



అన్ని దారులు పుష్కరిణి వైపే..

పద్మపుష్కరిణిలో స్నానమాచరించడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. రాత్రి వరకూ దాదాపు లక్షమందికిపైగా భక్తులు తిరుచానూరుకు తరలిరావడంతో ఎటుచూసినా భక్తుల రద్దీనే కనిపించింది.

ఉదయం: అమ్మవారికి శ్రీవారి సారె



తిరుచానూరు వద్ద సారె ఊరేగింపు..



శ్రీవారి ఆలయంలో

పంచమితీర్థం రోజున తిరుచానూరు పద్మావతిదేవికి శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిమళాన్ని విమాన ప్రాకారంలో తెల్లవారు జామున ఊరేగించారు. గర్భాలయంలో శ్రీవారి వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. 4.30 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి సారె ఊరేగింపు మొదలైంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఏకాంగులు, అర్చక పరిచారకులు కాలిబాటన అలిపిరికి చేరుకున్నారు. అక్కడ జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు. అక్కడి నుంచి సారె తీసుకుని భారీ ఏనుగు అంబారీ మధ్య కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండ్, లక్ష్మీపురం మీదుగా తిరుచానూరు ముఖద్వారం వద్దనున్న పసుపు మండపానికి 10.15 గంటలకు తీసుకొచ్చారు. సారెకు ప్రత్యేక పూజలు చేశాక టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, సీవీఎస్వో మురళీకృష్ణ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు తిరువీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి.. 10.56 గంటలకు పంచమితీర్థం మండపానికి తీసుకొచ్చారు.

- తిరుమల/తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

సాయంత్రం: బంగారు పద్మంపై పద్మావతి

చక్రస్నానం అనంతరం అమ్మవారిని పుష్కరిణికి ఎదురుగా ఉన్న గంగుంద్ర మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం శ్రీవారు పంపిన బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. సాయంత్రం 7.30 గంటలకు అమ్మవారు బంగారు పద్మంపై ఆశీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు.





నేడు: పుష్పయాగం

పద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఏటా బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి పుష్పయాగంలో పాల్గొనవచ్చు. ఈ సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దుచేశారు.

రాత్రి: ధ్వజావరోహణం

మంగళవారం రాత్రి 10- 11 గంటల మధ్య ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా అర్చకులు ధ్వజారోహణం రోజున ఎగురవేసిన గజపటాన్ని అవరోహణం చేశారు. ఉత్సవాల నిర్వహణకు ఆహ్వానించిన సకల దేవతలను, అష్టదిక్పాలకులకు బలినివేదన చేసి తిరిగి వారిని యథాస్థానానికి పంపించారు. ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకున్న పాంచరాత్ర ఆగమ పండితులు, అర్చకులను ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి ఆలయ మర్యాదలతో ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టారు. దీంతో ఈ నెల 17న ప్రారంభమై.. తొమ్మిది రోజులు వైభవంగా జరిగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, నరేష్‌కుమార్, శాంతారామ్, జానకిదేవి, రంగశ్రీ, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

సత్యవేడు రెవెన్యూ డివిజన్ హామీని నెరవేర్చండి సార్

● సీఎంకు ఎమ్మెల్యే ఆదిమూలం విజ్ఞప్తి

సత్యవేడు/పిచ్చాటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... 2024 ఏప్రిల్ 20న ఎన్నికల బహిరంగ సభలో సత్యవేడును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తానని సత్యవేడు టవర్‌క్లాక్ సాక్షిగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం 2024 ఆగస్టు 19న శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన సమయంలో సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సీఎంకు తాను వినతిపత్రం సమర్పించానని చెప్పారు. గత నెల కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ వినతి అందించానన్నారు. సత్యవేడు నియోజకవర్గం తమిళనాడు రాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో పాటు దేశానికి తలమానికంగా ఉన్న శ్రీసిటీలో సుమారు 300 బహుళ జాతి కంపెనీలు, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించిన హీరో, అపోలో, క్యాప్రికాన్ వంటి బడా కంపెనీలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, వీటన్నింటికి పరిష్కారం చూపాలంటే సత్యవేడు రెవెన్యూ డివిజన్ తప్పనిసరి అని ఎమ్మెల్యే వివరించారు. తన సత్యవేడు రెవెన్యూ డివిజన్ విజ్ఞప్తిని సీఎం పరిశీలించాలని కోరారు.

స్విమ్స్‌లో హైడిఫినిషన్ టీడీసీఎస్ చికిత్సలు

తిరుపతి(వైద్యం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లోని మానసిక విభాగం ఆధ్వర్యంలో హైడిఫినిషన్ టీడీసీఎస్ ద్వారా అత్యాధునిక వైద్య చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమని డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. మానసిక విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించిన హైడిఫినిషన్ టీడీసీఎస్ చికిత్సలను ఆయన పరిశీలించారు. మెదడు నాడీకణాలపై తక్కువ మోతాదులో విద్యుత్తు ప్రవాహాన్ని అత్యంత ఖచ్చితమైన మానిటరింగ్‌తో అందించే నాన్-ఇన్వేసివ్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ టెక్నిక్‌గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అత్యాధునిక వైద్య పద్ధతులను రాష్ట్రంలోనే మొదటిసారిగా స్విమ్స్ మానసిక విభాగంలో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇది మానసిక సమస్యలతో బాధపడేవారికి, మానసిక రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. న్యూరాలజీ, ఫిజియోథెరపీ రంగాల్లో కూడా ఈ చికిత్సలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్, మానసిక విభాగాధిపతి డాక్టర్ గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు హైడిఫినిషన్ చికిత్సలు నిర్వహిస్తున్న డాక్టర్ గణేష్‌కుమార్

వేగంగా పాపవినాశనం రోడ్డు విస్తరణ పనులు





వేణుగోపాల స్వామి ఆలయం వద్ద సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

● తొలిదశలో ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పాపవినాశనం రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఔటర్‌రింగు రోడ్డు నుంచి ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మిస్తున్నారు. టీటీడీ రూ.40 కోట్ల బడ్జెట్‌తో ఔటర్‌రింగు రోడ్డు నుంచి నేపాలి చెక్‌పోస్టు మీదుగా పాపవినాశనం దాకా ఈ పనులు చేపట్టింది. తిరుమలకు వచ్చే భక్తుల్లో సగానికిపైగా పాపవినాశనం, జపాలి ఆంజనేయస్వామి, ఆకాశగంగ, వేణుగోపాల స్వామి ఆలయాలను సందర్శిస్తుంటారు. రెండు వరుసల రోడ్డు మాత్రమే ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తరచూ తలెత్తుతున్నాయి.

తొలి దశలో : రింగురోడ్డు నుంచి ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణంతో పాటు వాహనాలు గోగర్భం డ్యాం మీదుగా వెళ్లే అవసరం లేకుండా ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి క్షేత్రపాలకుని ఆలయం మీదుగా మఠాలు, డిపింగ్‌యార్డు, నేపాలి చెక్‌పోస్టుకు చేరుకునేలా రోడ్డు నిర్మాణం పనులు మొదలుపెట్టారు. పాచికాల్వ బ్రిడ్జి పనులు దాదాపు చివరి దశలో ఉన్నాయి. మఠాల నుంచి నేపాలి చెక్‌పోస్ట్ వరకు నాలుగులైన్ల సీసీ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. ప్రస్తుతం నేపాలి చెక్‌పోస్టు నుంచి ఆకాశగంగ వరకు రోడ్డు నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. వేణుగోపాల స్వామి ఆలయం నుంచి ఆకాశగంగ వరకు అదనంగా రెండు లైన్ల నిర్మాణం కోసం దట్టమైన అడవిలో పనులు సాగుతున్నాయి. డిసెంబరు 31 నాటికి పనులు పూర్తిచేయాలని టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ప్రణాళికలు రూపొందించుకుంది. ఇక, ఆకాశగంగ నుంచి పాపవినాశనం వరకు ఉన్న రోడ్డు మార్గం ప్రభుత్వ ఫారెస్ట్ పరిధిలో ఉండటంతో నిర్మాణం కోసం ప్రభుత్వానికి టీటీడీ ఇప్పటికే లేఖ రాసింది. అనుమతులు లభించిన వెంటనే రెండవ దశలో ఈ రోడ్డు విస్తరణ పనులు కూడా మొదలుకానున్నాయి.

డక్కిలి 'విండో'కు పర్సన్ ఇంఛార్జి కమిటీ

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి సింగిల్‌విండోకు ప్రభుత్వం పర్సన్ ఇంఛార్జి కమిటీని నియమించింది. ఇప్పటి వరకూ అఫిషియల్ పర్సన్ ఇంఛార్జి కమిటీ కొనసాగుతుండగా ప్రభుత్వం దాని స్థానంలో అనధికార పర్సన్ ఇంఛార్జి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా వెలికంటి రమణారెడ్డి, సభ్యులుగా పిల్లి కృష్ణారెడ్డి, మెరిగ వెంకటస్వామిలను నియమించింది. కొత్తగా నియమించిన కమిటీ కాలపరిమితి వచ్చే ఏడాది జనవరి 30 దాకా వుంటుంది. ఆపై గడువు పొడిగించే అవకాశముంది. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు పాలకవర్గం గడువు పొడిగింపు

శ్రీకాళహస్తి సహకార టౌన్ బ్యాంకు పర్సన్ ఇంఛార్జి కమిటీ కాలపరిమితిని మ రో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత కమిటీ కాలపరిమితి ఈనెల 28వ తేదీ నాటికి ముగిసిపోనుంది.దీంతో ఈనెల29వ తేదీ నుంచీ వచ్చే ఏడాది మే నెల 28వ తేదీ వరకూ కమిటీ కాలపరిమితిని పొడిగించింది.

హింసకు వ్యతిరేకంగా పోరాడేందుకు

ముందడుగు వేద్దాం..!

● మహిళల రక్షణకు 100, 181, 1901 హెల్ప్‌లైన్లు

తిరుపతి (రూరల్/విశ్వవిద్యాలయాలు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, రక్షణకు ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు చేపడుతున్నాయని, తమకున్న హక్కులపై అవగాహన పెంచుకోవాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ డే ఫర్ ద ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ అగైనెస్ట్ ఉమెన్‌ని పురస్కరించుకుని జెండర్ సమానత్వంకోసం వర్సిటీ ఉమెన్‌స్టడీస్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పేరూరు పంచాయతీలోని మహిళలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలపై జరిగే హింసను నిర్మూలించడానికి ఐక్యరాజ్యసమితి ప్రత్యేకంగా ఈ దినోత్సవాన్ని ప్రకటించిందని, మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని హింసకి వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలన్నారు. మౌనాన్ని వీడి మార్పువైపు అడుగులు వేయాలని, పరస్పర సహకారంతో సురక్షిత వాతావరణాన్ని ఏర్పరచుకోవాలన్నారు. ప్రస్తుతడిజిటల్ ప్రపంచంలో మహిళలపై హింస కొత్త రూపాలలో పెరుగుతోందని, మహిళలు ఎదుర్కొంటున్న భౌతిక, మానసిక, ఆర్థిక, సామాజిక, హింస రూపాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ అరాష్‌మెంట్, బెదిరింపులు, సైబర్‌స్టాకింగ్, డీప్‌ఫేక్ వంటి టెక్నాలజీ ఆధారిత హింసకు పాల్పడుతున్నారని, టెక్నాలజీ వినియోగంలో మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల చట్టపరమైన రక్షణ కోసం ప్రభుత్వం 100,181,1091 వంటి హెల్ప్ లైన్ సదుపాయాలను అందుబాటులోకి తెచ్చిందని, వీటిని సద్వినియోగించుకోవాలన్నారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పత్తిపాటి నాగేశ్వరరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రమేష్, వాహిని, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ పద్మావతి, పక్కన ఏపీఎం నాగేశ్వరరావు తదితరులు